క్లుప్తంగా

నియామకం



చిట్యాల: మండలంలోని జూకల్‌లో కాంగ్రెస్ గ్రామ యూత్ కమిటీని ఆ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నియమించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా కంచు శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా పులి సంతోష్, కోల రాము, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొలుగూరి రాజు, ప్రధాన కార్యదర్శులుగా పొనగంటి మధు, బుస్సా రఘు, తిరుపతి, ప్రచార కార్యదర్శిగా వైనాల రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా కురిమిళ్ల పున్నం చందర్, కోశాధికారిగా మొలుగూరి రాకేశ్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా పోచంపల్లి రాంచరణ్ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సూర నరేందర్, నాయకులు పోలోజు సంతోష్, కావ టి మల్లయ్య, రేగూరి సమ్మిరెడ్డి, బోయిని రవి, ఆకుల శ్రీను, కోమల్‌రెడ్డి, గోపగాని శివ, నాగరాజు, చిరంజీవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లేట్ల పంపిణీ



కాళేశ్వరం: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వరముక్తీశ్వర స్వామి దేవస్థానం నిత్య అన్నదాన సత్రంలో భక్తులు భోజనం చేసేందుకు 50 స్టీల్ ప్లేట్లను ట్రస్టు నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ సోమవారం పంపిణీ చేశారు. అలాగే హైస్కూల్‌లో విద్యార్థులకు పెన్నులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు అన్నపూర్ణదేవి, అన్నదానసత్రం ఇన్‌చార్జ్ సాయితేజలకు వేర్వేరుగా అందజేశారు.

అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవాలి



ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న గిరిజనేతరులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొర్నబెల్లి గణేష్, గిరిజన అభ్యుదయ సంఘం నాయకుడు ముద్దబోయిన రవి కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. మేడారంలో ఆదివాసేతరులు అక్రమ కట్టడాలు, లాడ్జీల నిర్మాణం చేపట్టి కమర్షియల్ వ్యాపారాలు చేస్తున్నారని వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల చారాలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. వాటిని వెంటనే నిలిపివేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్మాణాలను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.

రేషన్‌కార్డులపై ఆశలు

గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే
- ఆహారభద్రత కార్డులు లేక ఇబ్బందులు
- సంక్షేమ పథకాలకు దూరమవుతున్న లబ్ధిదారులు



మల్హర్: ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలకు, తహసీల్దార్ కార్యాలయాల్లో ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు రేషన్ కార్డులు తప్పనిసరి. ఏడేళ్లుగా కొత్త రేషన్‌కార్డులతో పాటు కార్డుల్లో పేర్లు నమోదు చేసే ప్రక్రియ చేపట్టక పోవడంతో అనేక మంది పేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. కొత్త రేషన్ కార్డులతో పాటు పేర్ల చేర్పుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి రేషన్‌కార్డులు మంజూరు కాలేదు.

1,781 దరఖాస్తులపై సర్వే..

కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజలు నాలుగు దఫాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలన, గ్రామసభలు, ప్రజావాణి, మీసేవ, కులగణనలో ఆప్లై చేసుకున్నారు. దీంతో అర్హులను గుర్తించాలని ప్రభుత్వం ప్రత్యేక యాప్ ద్వారా సర్వేను చేపట్టింది. ఇప్పటికే మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో నూతన రేషన్‌కార్డులు, పేర్ల చేర్పులకు సంబంధించిన 1,781 దరఖాస్తుల డేటాను పౌరసరఫరాల శాఖ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసింది. వీటిలో కొత్తవి 1,234, యాడింగ్ 547 సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. సర్వే బాధ్యతలను జిల్లా అధికారులు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా అప్పగించారు.

గ్రామాల వారీగా వివరాలు

కొత్తవి, చేర్పులు సంబంధించినవి తాడిచర్లలో 567, మల్లారం 162, చిన్నతూండ్ల 49, పెద్దతూండ్ల 225, అడ్వాలపల్లి 52, దుబ్బపేట 9, కొయ్యూరు 47, వల్లెకుంట 133, కొండపేట 63, ఇప్పలపల్లి 68, ఎడ్లపల్లి 80, రుద్రారం 233, అన్సాన్‌పల్లి 74, మల్లెంపల్లి 19 దరఖాస్తులు యాప్‌లో నమోదు చేశారు. దీంట్లో భాగంగా దరఖాస్తుల వారిగా లబ్ధిదారుల ఎంపికకు ఆదాయ స్థితిగతులు, గతంలో కార్డు ఉందా, ప్రత్యేక కార్డు కావాలా, తదితర వివరాలను కార్యదర్శులు యాప్‌లో నమోదు చేస్తారు. అనర్హులైతే దరఖాస్తు తిరస్కరణకు గురవుతుంది. అర్హులైతే వివరాలు రికార్డు అవుతాయి. సర్వే నివేదిక (ఈపీఓఎస్ లాగిన్)పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు వెళ్తాయి. అక్కడి నుంచి లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది.

రేషన్ కార్డు ఇవ్వాలి



గ్రామ సభలో, ప్రజాపాలన, మీసేవ ద్వారా నూతన రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నా. అధికారులు దరఖాస్తుపై విచారణ చేపట్టి కొత్త రేషన్ కార్డు అందించాలి. రేషన్ కార్డు లేక పలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నా.

- అశోక్, తాడిచర్ల, మల్హర్

సర్వే జరుగుతోంది



నూతన రేషన్‌కార్డులు, పేర్ల చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన ప్రత్యేక యాప్ ద్వారా సర్వే జరుగుతోంది. అర్హులైన వారి జాబితా ఈపీఓఎస్ లాగిన్‌కు వెళ్తుంది. ఈ లాగిన్ ద్వారాకొత్త రేషన్‌కార్డు మంజూరవుతుంది.

- కంబాల రవికుమార్, తహసీల్దార్, మల్హర్

రాష్ట్రంలో పారదర్శక పాలన



రేషన్ షాపులు ప్రారంభించిన అనంతరం కాలనీ మహిళలతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 5, 6వ వార్డులైన కృష్ణకాలనీ, యాదవనగర్ కాలనీ రేషన్ షాపులు రెడ్డికాలనీ, ఎల్బీనగర్‌లో కాలనీల్లో ఉండడంతో లబ్ధిదారులు ఎనిమిది సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఎమ్మెల్యే రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా కాలనీల్లో సోమవారం ఉదయం పర్యటిస్తుండగా ఈ సమస్యను మాజీ కౌన్సిలర్ ఉడుత సరోజనజమల్ల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి సాయంత్రంలోగా రేషన్ షాపులను కాలనీల్లో ఏర్పాటు చేయించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దొడ్డు బియ్యం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టడంతో పాటు, పేదలకు సన్న బియ్యం అందించాలని ప్రజా ప్రభుత్వం ఉందని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ దేశంలోని ఆదర్శ పథకం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులుతో పాటు కార్యకర్తలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



టేకుమట్ల: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి



మల్హర్: నివాళులర్పిస్తున్న మధు

టేకుమట్ల: మండల కేంద్రంలోని బెజ్జెంకి రామయ్యతో పాటు, మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన భూలోకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు కొలిపాక రాజయ్య, పొన్నం చంద్రయ్య, మిట్టపల్లి చంద్రయ్య, కందుల దేవేందర్, ఆది రఘు, పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, పాల శంకర్, వాసాల రవి, మేకల రాజు, గువ్వాడి లక్ష్మన్, నేరెళ్ల సునీల్‌తో పాటు తదితరులు ఉన్నారు.

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో లింగమ్మ, చిన్నతూండ్ల గ్రామానికి చెందిన సమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సోమవారం పరామర్శించారు. అలాగే ఎడ్లపల్లి గ్రామానికి చెందిన మాంతయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు జాగిరి హరీశ్, నాయకులు రామారావు, పులిగంటి నర్సయ్య, తోట రాజేశ్వర్ రావు, సీనియర్ నాయకులు పద్దురావు, అయిలి కిష్టయ్య సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అక్కినవేని సుమన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పంతకాని వెంకట్ రాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సుమన్‌రావు

చిట్యాల: మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సీసీపీఎల్-3లో ఎస్ఎంహెచ్-బ్లాస్టర్ టీమ్ సభ్యులకు అపోలో రీచ్ ఆస్పత్రి జనరల్ మేనేజర్ నాయినేని సుమన్‌రావు సోమవారం ఏకరూప దుస్తులు, క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజం అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లవన్‌కుమార్, సభ్యులు సాయి నితిన్, రాజ్‌కుమార్, గడ్డం శివ, ఆకుల హరీష్, చింతకింది శ్రీనివాస్, చింతల మహేందర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సన్న బియ్యం



సన్నబియ్యం పంపిణీలో కాంగ్రెస్ నాయకులు

పలిమెల: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండెబోయిన చిన్నన్న సోమవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులు బియ్యం పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేదలందరికీ సన్న బియ్యం పథకాన్ని వర్తింపజేసిందన్నారు. త్వరలోనే అర్హులందరికీ రేషన్ కార్డుల పంపిణీ కూడా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి పాల్గొన్నారు.

ముగిసిన పికిల్ బాల్ టోర్నమెంట్



పికిల్ బాల్ విజేతలు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీ స్టే ఫిట్ స్పోర్ట్స్ జోన్‌లో మొదటిసారిగా నిర్వహించిన పికిల్ బాల్ టోర్నమెంట్ వేడుకలు సోమవారం ముగిశాయి. రాష్ట్రం నుంచి 16 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఫైనల్ పోరులో మొదటి స్థానంలో వెంకటేశ్వర్లు (సీఐ, సీసీఎస్ భూపాలపల్లి), ఎం.సంజయ్ (ఆర్పీఎఫ్ సీఐ, కాజీపేట), రెండో స్థానంలో ప్రణీత్, శ్రవణ్, మూడో స్థానంలో రెహాన్, నిఖిల్ గెలుపొందారు. విజేతలకు నిర్వాహకులు నగదు పురస్కారాలతో పాటు ప్రశంస పత్రాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రణీత్, సృజన్, ప్రదీప్, పవన్, డాక్టర్ డేవిడ్, విజయ్, రమేష్, సతీష్, రిషి పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న బాధ్యులు

వాజేడు : మండల కేంద్రంలో మూతబడిన శివాలయాన్ని పునరుద్ధరించేందుకు వాజేడు, నాగారం, జంగాలపల్లి గ్రామస్తులు విరాళాలు సేకరించాలని ఆదివారం రాత్రి నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల ప్రజలు శివాలయం వద్ద సమావేశం నిర్వహించి విరాళాలు సేకరిస్తున్నారు.

పుస్తకాలు అందజేత

మంగపేట : మండలంలోని రాజుపేట పీఎంశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్ పుస్తకాలను హెచ్‌ఎం బానోత్ బాలాజీ సోమవారం అందజేశారు. లక్ష్మీదేవిపేటకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం, దుర్గం మల్లయ్య వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దుర్గం సూరయ్య రూ.32,000 విలువైన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. ఇంగ్లిష్ నేర్చుకోవడం వల్ల ఎక్కడైనా ఏ విధంగానైనా ఉపాధి, ఉద్యోగ అవకాశం పొందవచ్చన్నారు. విద్యార్థులకు ఆంగ్లం నేర్చుకునేందుకు ఎంతో ఉపయోగపడే ఇంగ్లిష్ గ్రామర్ పుస్తకాలను అందించిన రిటైర్డ్ హెచ్‌ఎం సూరయ్యను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

- వైద్యాధికారి కొమరం మహేందర్



ర్యాలీగా వస్తున్న వైద్యసిబ్బంది

వాజేడు : పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలతో కలిసి వారు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే చుట్టు ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎండ కాలంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ఈ ర్యాలీలో వైద్యాధికారి తరుణ్, వెంకటరమణ, కోటిరెడ్డి, సత్య నాగవేణి, లలిత కుమారి, కన్యాకుమారి, రాజేశ్వరి, చిన్న వెంకటేశ్వర్లు, శేఖర్, ఆశ కార్యకర్తలు శాంత కుమారి, దేవి, జ్యోతి, శివకుమారి, సరిత, రవణమ్మ, అక్కెమ్మ, లక్ష్మి, చిలకమ్మ, జానకి ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మంగపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ రవీందర్



వెంకటాపురం(ఎం): నల్లగుంటలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ శైలజ

వెంకటాపురం(ఎం) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపురం వ్యవసాయ అధికారి శైలజ తెలిపారు. సోమవారం మండలంలోని నల్లగుంటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించగా, వెంకటాపురం మండల కేంద్రంలో తహసీల్దార్ గిరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,320లు, సీ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,300లు మద్దతు ధర చెల్లిస్తోందన్నారు. రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాసర్ల కుమారస్వామి, సీఈఓ శంకరయ్య, మండల వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.

మంగపేట : ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ రవీందర్ అన్నారు. మండలంలోని తిమ్మంపేట, కొత్తపేట, బాలన్నగూడెం, బుచ్చంపేట, బోరునర్సాపురం, వాగొడ్డుగూడెం, వాడగూడెం, కత్తిగూడెం గ్రామాల్లో మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ తోట రమేశ్‌తో కలిసి తహసీల్దార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి ఇచ్చే క్వింటాకు రూ.500 బోనస్ పొందాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, డైరెక్టర్లు ఆదినారాయణ, సత్యం, శ్రీధర్, సీఈఓ షామీర్, జగన్నాథరావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో..

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్‌గౌడ్, అదే విధంగా గోగుపల్లిలో డైరెక్టర్ వంగపల్లి రవి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈఓ అల్లి గౌరమ్మ, సిబ్బంది అజ్మత్‌పాష, రైతులు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

పట్టుతప్పితే.. ప్రమాదమే

పరిమితికి మించి వాహనాల్లో కూలీల తరలింపు
- ప్రమాదపుటంచున ప్రయాణం
- పట్టించుకోని రవాణాశాఖ అధికారులు



వాహనం వెనుక వేలాడుతున్న ప్రయాణికులు

వెంకటాపురం(కె) : ఇటీవల కూలీపనులకు వెళ్తూ ప్రమాదాలు జరుగుతున్న సందర్భాలు తరుచూ వింటున్నాం.. అయితే ప్రమాదమని తెలిసినా కూడా ప్రయాణం మాత్రం ఆపడం లేదు. రవాణా (గూడ్స్) వాహనాల్లో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకోని కూలీలు, ప్రయాణికులు తరలి వెళ్తున్నారు. ఆయా వాహనాల్లో పరిమితికి మించి కూలీలను, ప్రయాణికులను తీసుకు వెళ్తున్న సంబంధిత శాఖ అధికారులు అటువైపు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఆటోలో నలుగురికి మించి ప్రయాణికులకు తీసుకు పోవద్దనే నిబంధనలు ఉన్నప్పటికీ పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలు ప్రమాదాల బారిన పడి పలువురు గాయాల పాలవుతున్నారు. కొంతమంది మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నారే తప్ప మిగిలిన సమయాల్లో పట్టించుకోవటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా రవాణా శాఖ అధికారులు దృష్టి సారించి ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాల యజమానులు, డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

అధిక వేగం.. ఆపై ఫోన్‌కాల్స్

మండల కేంద్రంలోని కూలీలను వివిధ పనుల కోసం తీసుకు వెళ్లే వాహనాల డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్లపై తమకు ఇష్టం వచ్చినట్లుగా వాహనాలను నడుపుతున్నారు. అంతేకాకుండా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, వాహనాల్లో పెద్ద స్పీకర్ల సౌండ్‌తో చెలరేగిపోతున్నారు. అధిక వేగంతో వాహనాలను నడుపుతుండటంతో వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. ట్రాక్టర్ ట్రాలీలో కూర్చునేందుకు స్థలం లేక నిల్చునే కూలీలు వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఓవర్ లోడ్‌తో గూడ్స్ వాహనాలు

ఓవర్ లోడ్‌తో పాటు అతి వేగంగా వెళ్తున్న వాహనాలను సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని పలువురు వాపోతున్నారు. ఆటోలు, ట్రాక్టర్లు, రవాణా వాహనాల్లో కూలీలను, ప్రయాణికులను తరలిస్తున్న వారిపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని మండలవాసులు, ప్రయాణికులు కోరుతున్నారు.


అధికారులు దృష్టి సారించాలి



ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. పరిమితికి మించి గూడ్స్ వాహనాల్లో కూలీలను, ప్రయాణికులను తరలిస్తున్నారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్న పెను ప్రమాదం జరిగే అవకాశం ఉన్నాయి.

- ప్రసాద్, వెంకటాపురం

గర్భిణులకు వైద్యపరీక్షలు



వాజేడు : మండల పరిధిలోని పేరూరు ఆస్పత్రిలో వైద్యాధికారి యోషిత సోమవారం ప్రత్యేకంగా గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతో పాటు గర్భిణులకు పోషకాహారం వల్ల కలిగే లాభాలను తెలిపారు. పండ్లు, కూరగాయలు తీసుకోవాలని, సుఖ ప్రసవం కోసం వ్యాయామం, యోగా చేయడంతో పాటు మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ, సంగీత, రమ, అనూష, శకుంతల, సుమలత, అశ్విని తదితరులు ఉన్నారు.